క్లుప్తంగా

ప్రజా ఆశీర్వాద ర్యాలీని విజయవంతం చేయాలి

వీణవంక: హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాడి కౌశిక్‌రెడ్డి పేరును పార్టీ ప్రకటించింది. హుజూరాబాద్‌కు కౌశిక్‌రెడ్డి వస్తున్న సందర్భంగా సెప్టెంబర్ 2న తలపెట్టిన ప్రజా ఆశీర్వాద ర్యాలీని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాసాడి శ్రీధర్ రావు, చొప్పరి శ్రీనివాస్, చొప్పరి తిరుపతి కోరారు. మండలంలోని బేతిగల్ గ్రామంలో గురువారం మాట్లాడారు. మధ్యాహ్నం మూడు గంటలకు పరకాల క్రాస్ నుంచి హుజూరాబాద్ వరకు ర్యాలీ ఉంటుందని, పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గొర్రె రాజమౌళి, వీరంనేని సంపత్‌రావు, చొప్పరి బొందయ్య, కొక్కిరాల వేణుగోపాల్ రావు, మల్లాడి దేవేందర్‌రెడ్డి, శివశంకర్, గొట్టిముక్కల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నియామకం



నియామపత్రాలు అందజేస్తున్న అజయ్

గన్నేరువరం: యువజన కాంగ్రెస్ గన్నేరువరం గ్రామశాఖ అధ్యక్షుడిగా అభిలాష్, ఉపాధ్యక్షుడిగా మంగారపు శ్రీమాన్‌సాయి నియామకమయ్యారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం సమావేశమై ఎన్నికలు నిర్వహించామని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడికె అజయ్ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గన్నేరువరం గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మానకొండూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శ్రావణ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి దేశరాజ్ అనిల్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి రాపోలు నవీన్, మంగారపు అనిల్, బుర్ర శ్రీకాంత్, రాపోలు హరీశ్ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నికలు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా పానుగంటి అగయ్య, కార్యదర్శిగా సాయిల్ల రాజు, డైరెక్టర్లుగా తొంటి అశోక్, బండారి సంపత్, సాయిల్ల బీరయ్య, సందనవేని అనిత, సూర అనిత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జలాలుద్దీన్ అక్బర్ వ్యవహరించగా, ఎంపీపీ చిలుక రవీందర్, సర్పంచ్ లింగయ్య నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

పరిహారం చెల్లింపులో విఫలం

వీణవంక: అకాల వర్షాలకు దెబ్బతిన్న వరి పంటకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ వీణవంక మండల సీనియర్ నాయకులు చింతల శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మామిడాలపల్లిలో గురువారం మాట్లాడారు. యాసంగిలో అకాల వర్షాలు, వడగండ్లకు పంటలు దెబ్బతిన్నాయని, అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలన, సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు పరిహారం చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించినప్పటికీ కేవలం మొక్కజొన్న పంటకు మాత్రమే పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారులు చేసిన సర్వే ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ



నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ మంద వెంకటరమణారెడ్డి, జోన్ చైర్మన్ దొమ్మాట జగన్‌రెడ్డి, కోహెడ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిగురుమామిడి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఎడవెల్లి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శిగా ఆకవరం శివప్రసాద్, కోశాధికారిగా ఏలేటి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కనపర్తి సత్యం, జంగ వెంకటరమణారెడ్డి, మెంబర్‌షిప్ అధ్యక్షుడిగా శేషం నర్సింహాచారి, సహాయకార్యదర్శిగా గంప చంద్రశేఖర్ను ఎన్నుకున్నామని జిల్లా క్యాబినెట్ కార్యదర్శి మంద వెంకటరమణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లయన్ మెంబర్ రాజిరెడ్డి, సంజీవరెడ్డి పలువురు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హుజూరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీ, కోర్సుల్లో చేరాలనుకునేవారు సెప్టెంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తు తీసుకోవాలని హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఇందిరాదేవి, అధ్యయన కేంద్ర కో ఆర్డినేటర్ శనిగారపు సమ్మయ్య గురువారం ప్రకటనలో తెలిపారు.

పర్యావరణహిత గణేశ్ విగ్రహాలు

- వెదిర గ్రామ శివారులో మూడు నుంచి పది ఫీట్ల వరకు తయారీ
- మూడు నెలల క్రితం కలకత్తా నుంచి వచ్చిన కళాకారులు
- సమీపిస్తున్న వినాయక చవితి

రామడుగు: వినాయక చవితి నేపథ్యంలో పర్యావరణహిత విగ్రహాలను డిమాండ్ పెరుగుతోంది. కళాకారులు వైవిధ్యమైన గణపతుల విగ్రహాలను తయారు చేస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. రామడుగు మండలం వెదిర గ్రామ శివారులో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి పక్కన షెడ్డులో పశ్చిమబెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తా నుంచి వచ్చిన కళాకారులు మట్టి వినాయక విగ్రహాలను భక్తుల కోసం సిద్ధం చేస్తున్నారు. కలకత్తా నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక మట్టితో మూడు మాసాలుగా విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఎనిమిది మంది విగ్రహ తయారీ కళాకారులు ఇప్పటివరకు దాదాపుగా మూడు వందలకు పైగా విగ్రహాలను తయారు చేశారు. స్థానికంగా లభ్యమయ్యే ఎండు గడ్డి, వెదురుకర్రలు, దారంతో విగ్రహ ఆకారాలను రూపొందించిన తర్వాత కలకత్తా నుండి తీసుకువచ్చిన మట్టిని పట్టిస్తారు.



మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలు

మూడు నుంచి పది ఫీట్ల వరకు..

కళాకారులు భిన్న వినాయక విగ్రహాలను మూడు నుంచి పదిఫీట్ల వరకు అద్భుతంగా తయారు చేస్తున్నారు. అటు తర్వాత విగ్రహాలకు హాని కలిగించని వాటర్ కలర్స్‌ను మాత్రమే విని యోగిస్తున్నామని, రూ.నాలుగు వేల నుంచి రూ.12 వేల వరకు మట్టి వినాయక విగ్రహాలు అందుబాటులో ఉన్నాయని కళాకారులు తెలిపారు.

మట్టి విగ్రహాల వైపు మొగ్గు

కాలుష్య కోరల నుంచి సమాజాన్ని కాపాడటమే ధ్యేయంగా వినాయక చవితి ఉత్సవాలకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయాలని పలువురు సామాజిక వేత్తల చేసిన సూచనల మేరకు భక్తులు ఆ దిశగా ముందుకుసాగుతున్నారు. కాలనుగుణంగా వస్తున్న మార్పులకు మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేయడానికి ఇష్టపడుతున్నారు. ప్రధానంగా యువత పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా ముందుకువస్తున్నారు.



తయారీలో నిమగ్నమైన కళాకారులు

ఎనిమిదేళ్లుగా తయారీ



కలకత్తా నుంచి మూడు నెలల క్రితం ఇక్కడికి వచ్చి విగ్రహాల తయారీ ప్రారంభించాం. ఇప్పటివరకు మూడు వందల వరకు విగ్రహాలను సిద్ధం చేశాం. మరిన్ని విగ్రహాలను పలు ఆకృతుల్లో త్వరగా తయారు చేస్తాం. మట్టి వినాయకులకు మంచి గిరాకీ ఉంది. ఎనిమిదేళ్ల నుంచి ఇక్కడే తయారు చేస్తున్నాం.

– బబ్లూపాల్, విగ్రహాల తయారీదారుడు

మట్టి విగ్రహాలే పెడతాం



ఊరిలో ఎక్కువ శాతం మట్టి వినాయక విగ్రహాలే పెడతాం. గతంలో గ్రామ పంచాయతీ వారు మట్టి వినాయక విగ్రహాలు పెట్టాలని సూచించారు. దీంతో పర్యావరణ సంరక్షణకు మట్టి విగ్రహాలు పెట్టడం జరుగుతుంది. మట్టి వినాయక విగ్రహాలపై ప్రజల్లో చాలా మేరకు చైతన్యం వచ్చింది.

– కాడె నర్సింగం–వెలిచాల

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



చొప్పదండి: స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గురువారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను పీసీసీ బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్‌గా నియామకం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, రాజేశం, రంగయ్య, సునీల్, చందు, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఈటల రాజేందర్

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో ఆగస్టు 29 నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు మడుగూరి సమ్మిరెడ్డి, మోటం చిన్న వెంకటేశ్, మాడ గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు

గన్నేరువరం: హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని గుండ్లపల్లి, గునుకులకొండాపూర్, చొక్కారావుపల్లె గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. గుండ్లపల్లి సర్పంచ్ బేతెల్లి సమత భర్త రాజేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పద్మ భర్త చింతల పర్శరాం, గునుకులకొండాపూర్ సర్పంచ్ లింగంపల్లి జ్యోతి భర్త లింగంపల్లి బాలరాజ్, నాయకులు వంగాల సత్యనారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, లక్ష్మారెడ్డి, వడ్డే హన్మంతరెడ్డి, కొమ్మెర ప్రశాంత్‌రెడ్డి, జాప అశోక్‌రెడ్డి, చొక్కారావుపల్లె రెడ్డి సంఘం నాయకులు అన్నాడి కిషన్‌రెడ్డి, అర్కంతం గోపాల్‌రెడ్డితో మరో 150 మంది పార్టీలో చేరారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు అనంతరెడ్డి, సునీల్, మండల అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

108లో ప్రసవం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గోదారి మమత (24) 108 వాహనంలో ప్రసవించింది. పురుటి నొప్పులతో బాధపడుతున్న మమతను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురుటినొప్పులు ఎక్కువ కావడంతో డాక్టర్ గోపినాథ్ సలహాతో 108 సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించామని సిబ్బంది తెలిపారు.



ప్రతీ ఇంట్లో సందడి వాతావరణం

ఘనంగా రక్షాబంధన్

హుజూరాబాద్: ఆత్మీయ బంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్‌ను గురువారం పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. సోదరీసోదరుల మధ్య ప్రేమ, ఆప్యాయతకు చిహ్నంగా నిలిచే రాఖీ పండుగ రోజు ప్రతీ ఇంట్లో సందడి నెలకొంది. శామీర్‌పేటలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమా, ఇతర మహిళలు రాఖీ కట్టారు. పండుగ సందర్భంగా బస్టాండ్, షాపింగ్‌మాల్స్, స్వీటు షాపులు మహిళలతో కిటకిటలాడాయి. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావును ఎంపీపీ రాణి మర్యాదపూర్వకంగా కలిసి రాఖీ కట్టారు. అలాగే ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డికి రాఖీ కట్టి అనుబంధాన్ని చాటుకున్నారు. పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో రక్షాబంధన్ నిర్వహించారు. వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని ఆర్ఎస్ఎస్ జిల్లా సహసేవక్ ప్రముఖ్ గుంటి శ్రీనివాస్ అన్నారు. డివిజన్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. రక్షాబంధన్ కుటుంబ, సామాజిక, దేశ ఐక్యతకు చిహ్నమని, మన సంస్కృతిలో భాగం, సాంప్రదాయబద్ధంగా కొనసాగిస్తున్నామని గుర్తు చేశారు. మతం వ్యక్తిగతం దేశ రక్షణ అందరి బాధ్యత అని అన్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల్లో ప్రతి పండుగకు విశేషమైన ప్రాధాన్యత ఉందన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి–ఇందిరానగర్ సర్పంచ్ కొడిగూటి శారద రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కట్టారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలోని గ్రామాల్లో రాఖీ పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్లు, రాఖీ విక్రయషాపులు మహిళలతో రద్దీగా కనిపించాయి. రాఖీలు కట్టిన తర్వాత కానుకలు, స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

సైదాపూర్: రక్షాబంధన్ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో సందడి నెలకొంది. అనుబంధానికి ప్రతీకగా నిర్వహించే పండుగను ఘనంగా జరుపుకున్నారు. రాఖీ కట్టడానికి ఆడబిడ్డలు రావడంతో ప్రతి ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది.

రామడుగు: మండలంలో రక్షాబంధన్‌ను ఘనంగా జరుపుకున్నారు. గుండి గ్రామ సేవా బస్తీలో ధర్మ జాగరణ విభాగం మండలశాఖ ఆధ్వర్యంలో నాయకులు పలువురికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మజాగరణ విభాగం నాయకులు పాకాల రాములుగౌడ్, దుర్గం రాజేశం, ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, రాజయ్య పలువురు పాల్గొన్నారు.

మానకొండూర్/మానకొండూర్‌రూరల్: మానకొండూర మండలంలో రక్షాబంధన్‌ను ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎక్కడో ఉన్న ఆడబిడ్డలు పుట్టిళ్లకు చేరుకొని నాకు నీవు రక్షా, నీకు నేను రక్షా అంటూ ప్రేమతో రాఖీలు కట్టారు. సుడా చైర్మన్ జీవీరామకృష్ణారావు, సోదరులకు అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు రక్షాబంధన్‌ను ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటిలో ఆడపడుచులు అన్నదమ్ములకు రాఖీ కట్టి శుభాకాంక్షలు చెప్పారు.



మంత్రి హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న ఎంపీపీ రాణి



అంబేద్కర్ విగ్రహానికి రాఖీ కడుతున్న సర్పంచ్ శారద



మానకొండూర్: సుడా చైర్మన్ జీవీఆర్, సోదరులకు రాఖీ కడుతున్న అక్కాచెల్లెళ్లు



చిగురుమామిడి: ఇందుర్తిలో...



రామడుగు: గుండిలో..

సీసీ రోడ్డు నిర్మించరు.. పర్మిషన్ ఇవ్వరు

- గుంతల రోడ్డుతో విద్యార్థులు, అధ్యాపకుల తంటాలు
- గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జ్యోతిష్మతి చైర్మన్ సాగర్‌రావు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి కళాశాల నుంచి రాజీవ్ రహదారి వరకు మట్టిదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు అనుమతి ఇవ్వాలని పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు ఆరోపించారు. గురువారం కళాశాలలో మాట్లాడారు. మట్టి రోడ్డుతో కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, పంచాయతీ తరపున రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. సొంత ఖర్చులతో నిర్మిస్తామని చెప్పినా పర్మిషన్ ఇవ్వడం లేదని తెలిపారు. సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాలలోని సాయిబాబా, సరస్వతి దేవాలయానికి నిత్యం వచ్చే భక్తులకు మట్టి రోడ్డుతో వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నారని, ఈ విషయమై 2020లో అప్పటి కలెక్టర్‌కు సమస్యను తెలియజేశామన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు ఎంక్వైయిరీ చేసి భూమి వివాదంలో ఉందని రోడ్డుకు అనుమతిని తిరస్కరిస్తూ తీర్మానం చేశారని, రోడ్డు, భూమికి సంబంధం లేనందునా అనుమతి ఇవ్వాలని కోరారు.



గుంతలమయంగా కళాశాలకు వెళ్లే మట్టి రోడ్డు

ఎదురెదురుగా బైకులు ఢీ

శంకరపట్నం: మండల కేంద్రంలో గురువారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలు కాగా 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారం మేరకు మండల కేంద్రానికి చెందిన విష్ణువర్ధన్ భార్యతో రాఖీపౌర్ణమి సందర్భంగా హుజూరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మండలానికి కంటి శ్రీనివాస్ అనే యువకుడు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో విష్ణువర్ధన్‌కు తీవ్రగాయాలయ్యాయి.



గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది